వ్యర్థాలను నిర్దిష్ట ప్రాంతాల్లోనే డంప్ చేయాలి

- జోనల్ కమిషనర్ స్నేహాశబరీశ్
- రెండు ట్రాక్టర్లకు రూ.25వేల చొప్పున జరిమానా

మాదాపూర్: వ్యర్థాలను నిర్దిష్టమైన ప్రదేశాలలోనే డంపింగ్ చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహాశబరీశ్ సూచించారు. శనివారం మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో చందానగర్ డిప్యూటి కమిషనర్ వంశీకృష్ణతో కలసి తనిఖీలు చేశారు. భవన నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాల అక్రమ డంపింగ్ జరిగే ప్రాంతాలను, చెరువులను తనిఖీ చేశారు. డంపింగ్‌ను నిర్మూలించడానికి రాత్రి వేళలో సిబ్బందిని నియమించామన్నారు. నిర్దిష్టమైన ప్రదేశాలలో మాత్రమే డంపింగ్ చేయాలని కోరారు. అతిక్రమించిన వారిపై భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. యశోద ఆస్పత్రి వెనుక ప్రాంతంలో డంపింగ్ చేస్తున్న 2 ట్రాక్టర్లను గమనించి వాటికి ఒక్కో ట్రాక్టర్‌కి రూ.25వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో చందానగర్ ఏఎంఓహెచ్ నైట్ డ్యూటీ సిబ్బంది పాల్గొన్నారు.



యశోద ఆస్పత్రి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్‌సీ స్నేహాశబరీశ్ తదితరులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

డీఎస్పీ పురుషోత్తంరెడ్డి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, ఎంవీఐ రాజా మహ్మద్

పటాన్‌చెరు టౌన్: రహదారి భద్రత నిబంధనలు పాటించి, ప్రమాదాలను నివారించాలని పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసాల్లో భాగంగా శనివారం పటాన్‌చెరు ఎంవీఐ రాజా మహ్మద్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. 'రహదారి భద్రత నిబంధనలు పాటించండి... హీరో అవ్వండి' అని నినాదాలతో వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆటోలకు స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ... వాహనదారులు జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సీట్ బెల్ట్ ,హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ...మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపొద్దని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు క్రైమ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా

జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

పటాన్‌చెరు టౌన్: ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి తెలిపారు. శనివారం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ఓటరు ప్రత్యేక శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సందర్శించి, ఓటరు నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల మార్పు కోసం దరఖాస్తు చేసుకునే ఫారం వివరాలు బీఎల్ఓను అడగగా ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక నమోదు శిబిరాలకు వచ్చే ఓటర్లకు ఎలా అవగాహన కల్పిస్తావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన లేని బీఎల్వోలకు మళ్లీ శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ ఈర్ల దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ మాధురి

అంకితభావంతో ప్రజలకు సేవలందించాలి



- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి
- 138 మంది పోలీసు సిబ్బందికి పతకాలు అందజేత

రాయదుర్గం: అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో శనివారం 138 మంది పోలీసు సిబ్బందికి పతకాలు అందించారు. అందులో 58 మందికి ఉత్కృష్ట సేవా పతకాలు, 80 మందికి సేవా పతకాలు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖకు మంచి పేరు వచ్చేలా విధులు నిర్వహించాలని సూచించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్ మాట్లాడుతూ కుటుంబసభ్యుల సహకారం లేనిదే విధుల్లో ఉత్తమ పనితీరు కనబర్చలేమన్నారు. కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ రవిచందన్‌రెడ్డి, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఏసీపీలు, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సెక్షన్ సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

న్యాక్‌కు అసోచాం ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకున్న న్యాక్ డైరెక్టర్లు శాంతిశ్రీ, రాజిరెడ్డి

మాదాపూర్: న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్)కు అసోచాం ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు 2023 దక్కింది. న్యూ ఢిల్లీలో జరిగిన 6వ ఇంటర్నేషనల్ సస్టైనబిలిటి కాన్‌క్లేవ్‌లో న్యాక్ డైరెక్టర్లు శాంతిశ్రీ, ఎం.రాజిరెడ్డి ఈ అవార్డు అందుకున్నారు. న్యాక్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వృత్తి విద్య శిక్షణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నందుకు గాను, భవన నిర్మాణ రంగంలో అన్ని విభాగాలలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నందుకు ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు.

ఉత్సాహంగా 10కె రిలే రన్

గచ్చిబౌలి: హైదరాబాద్ ఫస్ట్ ఎవర్ 10కె రిలే రన్ ఉత్సాహంగా సాగింది. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో సూపర్ సర్ఫేస్, హోగర్ కంట్రోల్స్ ఆధ్వర్యంలో ఫిట్రెప్లై పేరిట వినూత్న రీతిలో మొదటిసారి 10కె రిలే రన్ నిర్వహించారు. ప్రతి ఫ్యాబ్-5 జట్టులో ఐదుగురు సభ్యులుంటారని, ఒకొక్కరు రెండు కిలోమీటర్లు రన్ చేస్తారని హగర్ కంట్రోల్స్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ రవీంద్ రెడ్డి తెలిపారు.హైదరాబాద్‌లో వినూత్న రీతిలో 10కె రిలే ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వందలాది మంది రన్నర్లు రిలే రన్‌లో పాల్గొన్నారు.



ఫ్లైఓవర్లు, కేబుల్ బ్రిడ్జిపై భారీ వాహనాలకు అనుమతి లేదు

మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ నర్సయ్య

మాదాపూర్: మద్యం తాగి వాహనాలను నడపరాదని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ గోపిశెట్టి నర్సయ్య అన్నారు. మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్‌లోని ఐటీ కంపెనీలలో విధులు నిర్వహిస్తున్న క్యాబ్ డ్రైవర్లకు శనివారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. భారీ వాహనాలకు ఉదయం 7.30 నుంచి 11.30.. సాయంత్రం 4గంటల నుంచి 10.30 గంటల వరకు ప్రవేశం ఉండదని తెలిపారు. భవన నిర్మాణ పనులకు ఉపయోగించే వాహనాలు ఉదయం 6గంటల నుంచి రాత్రి 10.30గంటల నిషిద్ధమని తెలిపారు. కార్యాలయాలకు తొందరగా వెళ్ళాలని వాహనాలను వేగంగా నడపవద్దన్నారు. డ్రైవర్లు సీట్‌బెల్టు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. దాదాపు 500లకు పైగా క్యాబ్‌డ్రైవర్లు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్య

జాతీయ రహదారిపై వాహనదారుల తిప్పలు...



రామచంద్రాపురం పట్టణం అశోక్‌నగర్ వద్ద జాతీయ రహదారిలో యూటర్న్ వద్ద ట్రాఫిక్ సమస్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో జాతీయ రహదారిపై వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. దీనికి తోడు ప్రమాదాల కారణంగా రహదారిపై పలుచోట్ల అధికారులు యూటర్న్‌లను మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న యూటర్న్ వద్ద వాహనదారులు ఇబ్బందిపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీని పూర్తిస్థాయిలో నియంత్రించడంలో అధికారులు విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లింగంపల్లి చౌరస్తా నుంచి అశోక్‌నగర్ సమీపంలో ఒకటే యూటర్న్ ఉండడంతో చాలా మంది వాహనదారులు రాంగ్ రూట్లో ప్రయాణిస్తున్నారు. దీనికితోడు ట్రాఫిక్ అస్తవ్యస్తం అవుతోంది. ఇక ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతుంది. ఆ సమయంలో యూటర్న్‌ల వద్ద వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అనేకచోట్ల జాతీయ రహదారిపైనే వాహనాలు నిలవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడ ఉన్న యూటర్న్‌లను మూసివేసి మరొకచోట తెరుస్తున్నారు. యూటర్న్ కోసం చాలా దూరం వెళ్లాల్సి రావడంతో వాహనదారులు రాంగ్ రూట్లో వస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు రద్దీ సమయంలో చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిబ్బంది ఉండాలి

జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా యూటర్న్‌లు దగ్గరగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే వాహనదారులకు ఎంతో ఉపయోగం.

–బలరాం, రామచంద్రాపురం

నియంత్రిస్తున్నాం



జాతీయ రహదారిపై పూర్తిస్థాయిలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ యూటర్న్‌లను మూసివేయడం జరిగింది. ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోని వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

–పవన్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: 'వరల్డ్ పీస్ డే'ను పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో రాజయోగ టీచర్, మోటివేషనల్ స్పీకర్ బి కె వసంత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 55–70, బెండ 40, కాకర 60, దొండ 40, దోస 50, ఆలు 25, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 70, బీన్స్ 40, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 55, చిక్కుడు 40, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (3) 20, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 250.

ఐడబ్ల్యూడబ్ల్యూఏ సదస్సులో 'ఎస్కీ' స్టాల్

రాయదుర్గం: కోయంబత్తూరులో ఐడబ్ల్యూడబ్ల్యూఏ వార్షిక సమావేశంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు తెలిపారు. ఈ స్టాల్‌ను టీఎస్‌ఏయూ వీసీ ప్రొ. గీతాలక్ష్మీ ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్కీ ద్వారా నిర్వహించే కోర్సులు, అందించే శిక్షణా కార్యక్రమాలు, కన్సల్టెంట్ సేవలపై సందర్శకులకు అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. అధ్యాపకులు తమ కోర్సులలో ఎస్‌డీజీ సంబంధిత థీమ్‌ల కంటెంట్‌ను 50 శాతానికి పెంచడం గురించి ఆలోచించాలని సూచించారు. ముఖ్యంగా పోర్చుగల్, జర్మనీ, యూఎస్‌ఏ, సింగపూర్ నుంచి వక్తలు పాల్గొన్నారు.

80 మందికి వైద్య పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: రామచంద్రాపురం పరిధిలోని వెలమెల తండాలో హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఏషియన్ పెయింట్స్ సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 80 మంది తండావాసులు పరీక్షలు చేయించుకున్నట్లు సంస్థ ప్రతినిధి సాంబరాజు తెలిపారు.

విద్యార్థినికి సత్కారం

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వర కాలనీకి చెందిన భాస్కర్‌రావు, మాధవీలత దంపతుల కుమార్తె సాయి సుదీక్ష జేఎన్‌టీయూ నుంచి బీటెక్ (ఇంజనీరింగ్)లో ప్రతిభ కనబర్చినందుకు శనివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ విద్యార్థినిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, కాలనీవాసులు రాజశేఖర్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



సాయిసుదీక్షను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఉత్సాహంగా మారథాన్



రాయదుర్గం: జాతీయ యువజన వారోత్సవాలలో భాగంగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో విద్యార్థులకు మారథాన్ పోటీలను నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్ వద్ద ప్రారంభమైన ఈ మారథాన్ క్యాంపస్‌లోని ప్రధాన రోడ్ల మీదుగా సాగి తిరిగి స్కూల్‌కు చేరుకున్నారు. విద్యార్థులు మారథాన్‌లో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మురళి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ ఆటలాడడం, రన్నింగ్ చేయడంతో శారీరకంగా దృఢంగా మారడంతో బాటు సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు పద్మశాలి సంఘం కృషి చేయాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైటెక్‌సిటీ పద్మశాలి సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కుటుంబాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హైటెక్ సిటీ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా గంజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, గౌరవ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, కోశాధికారి సీహెచ్.రాము, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మన్నెపల్లి సాంబశివరావు, గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయాభివృద్ధికి రూ.25 లక్షల విరాళం



ఆలయ కమిటీ ప్రతినిధులకు రూ.25 లక్షల చెక్కును అందిస్తున్న రవీందర్‌రెడ్డి కుటుంబసభ్యులు

రాయదుర్గం: పోచమ్మ ఆలయాభివృద్ధికి రూ.25 లక్షల విరాళాన్ని నానక్‌రాంగూడకు చెందిన డి జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి కుటుంబం ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులకు అందించారు. స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయ పురోభివృద్ధికి ఈ నిధులను వినియోగించుకోవాలన్నారు. ఆలయ నిర్మాణానికి భక్తులంతా తమవంతు సహకారం అందించాలని కమిటీ ప్రతినిధులను కోరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ముత్యంరెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్‌గౌడ్, తుకారామ్ బిర్కడ్, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రామపంచాయతీ కోసం వినతి

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్ గ్రామాలను కలుపుతూ ప్రత్యేక గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు శనివారం సర్పంచ్ ప్రకాశ్‌చారితో పాటు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రస్తుతం గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్, కిష్టాయిపల్లి, దాచారం గ్రామాలు ఉన్నాయన్నారు. గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్ గ్రామాలను కలుపుతూ ప్రత్యేక గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వానికి కూడా విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పెంటేశ్, సత్యనారాయణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'హెరిటేజ్ వాక్ 3'

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని లాంకో హిల్స్, క్లబ్ జియస్ వేదికగా నేడు 'హెరిటేజ్ వాక్ 3' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ హెరిటేజ్ వాక్‌లో భాగంగా గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ, లాంకోహిల్స్ తదితర ప్రాంతాలవాసులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రతిష్టాత్మక 'హెరిటేజ్ రాక్ పార్క్' ఔన్నత్యాన్ని తెలియజేసేలా, ఇలాంటి ప్రదేశాలను పరిరక్షించేలా అవగాహన కల్పించడానికి ఈ వాక్ ఏర్పాటు చేశామన్నారు. ఈసారి మూడవ హెరిటేజ్ వాక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొంటారని వారు తెలిపారు.

దరఖాస్తు గడువు 23 వరకు పొడిగింపు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహిస్తారని గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించారని ,ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటిన వారికి ఈ విద్యాసంస్థలలో చేరేందుకు అవకాశం కల్పిస్తారని ఆమె వివరించారు.

హెచ్‌సీయూ ప్రొ.చంద్రశేఖర్ భట్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



ఐఎస్ఎస్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు స్వీకరిస్తున్న భట్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన అవార్డు లభించింది. హెచ్‌సీయూలోని సోషియాలజీ, ఆంత్రోపాలజీ విభాగం 1979లో ప్రారంభించినప్పటి నుంచి ప్రొఫెసర్ చంద్రశేఖర్ భట్ విధుల్లో ఉన్నారు. భారతీయ సామాజిక శాస్త్రాల సంఘం (ఐఎస్ఎస్) ప్రతిష్టాత్మకమైన జీవితకాల సాఫల్య (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్) అవార్డును ఇటీవల స్వీకరించారు. దశాబ్దాలుగా సోషియాలజీ అధిపతిగా యూజీసీ–ఎస్ఏపీ కోఆర్డినేటర్‌గా, యూజీసీ సబ్జెక్ట్ ప్యానెల్ సభ్యునిగా సామాజిక శాస్త్రానికి చెందిన ప్రముఖ విభాగాల్లో ఒక దానిని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయనకు జీవితకాల సాఫల్య అవార్డు రావడం పట్ల పలువురు ప్రొఫెసర్లు ఆయనను అభినందించారు.

రోడ్లపై వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు

- వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

గచ్చిబౌలి: నిర్మాణ వ్యర్థాలు రోడ్ల వెంట, కాలనీలోని ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు. గౌలిదొడ్డి, హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ సమీపంలో డంపింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు అక్రమ డంపింగ్‌పై నిఘా పెట్టారని పేర్కొన్నారు. నిర్మాణ వ్యర్థాలను డంప్ చేసి మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండవ సారి పట్టుపడితే రూ.50 వేలు, మూడోసారి పట్టుబడితే లక్ష రూపాయల జరిమానా, కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేస్తామని చెప్పారు. అక్రమ డంపింగ్‌పై టోల్ ఫ్రీ నెంబర్ 18001201159, వాట్సాప్ నెంబర్ 9100927073 లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నృత్యార్చన



మాదాపూర్: కళాకారులు నృత్యాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా భాస్కర డ్యాన్స్ అకాడమీ శిష్యబృందం పుష్పాంజలి, గణేశకౌతం, కృష్ణ కలయసఖి, రామాయణ శబ్దం, హనుమాన్ చాలీసా, బ్రహ్మమురారీ, సంకీర్తనలను కూచిపూడి నృత్యరూపంలో ప్రదర్శించారు. అకాడమీ గురువు డి.సాత్విక, శిష్యబృందాన్ని జ్ఞాపికలతో సత్కరించారు.

దేశవ్యాప్తంగా కులగణన జరగాలి

రాయదుర్గం: కులగణనతో సామాజిక న్యాయం, సమగ్ర ఆర్థికాభివృద్ధి, అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని భారత్ జోడో అభియాన్ కోఆర్డినేటర్ యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ప్రొ.వెంకటేష్ మాట్లాడుతూ కులగణన దేశవ్యాప్తంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ, వివిధ యూనివర్శిటీల ప్రొఫెసర్లు, ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ నాయకులు సాయికిరణ్, కొండల్, మురళి యాదవ్, శివయాదవ్, ప్రవీణ్, లక్కీ, సాయి దీపక్ పాల్గొన్నారు.

సంకీర్తనాలాపన



మాదాపూర్: కళాకారులు వీణానాదంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం ఆంఫిథియేటర్‌లో రాయప్రోలు సుధాకర్ శిష్య బృందం వీణతో వివిధ రకాల సంకీర్తనలను ఆలపించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



సతీష్ (ఫైల్)

హఫీజ్‌పేట్ : ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన ప్రకారం..చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన నాగరాణి కుటుంబంతో నివాసముంటుంది. ఆమె తమ్ముడు సతీష్ (24) గతంలో ఫ్లిప్‌కార్ట్‌లో పని చేసేవాడు. నెల రోజుల నుంచి ఉద్యోగం లేక ఖాళీ ఉంటున్నాడన్నారు. దీంతో సతీష్ నిరాశ చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని అక్క నాగరాణి రాత్రి ఇంటికి రాగా ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూసింది. వెంటనే ఇంటి పక్కన ఉన్న వారి సహాయంతో తలుపులు బద్దలుకొట్టి చందానగర్ పోలీసులకు సమాచారం అందించింది. తమ్ముడి ఆత్మహత్యపై అనుమానం ఉందని పోలీసులకు తెలుపడంతో కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.